క్లుప్తంగా

ఎస్ఎఫ్ఐ ప్రజ్ఞా వికాసం ఫలితాలు విడుదల

మైలవరం: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాసం ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ నాయక్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మొదటి బహుమతి అభిరామ్ 91, రెండవ బహుమతి 86 నవీన్‌కుమార్, మూడో బహుమతి 85 కుసుమ ప్రియ, రమ్య నాలుగవ బహుమతి 80 యశస్వి సాధించారన్నారు. వారందరికీ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ తరఫున అభినందనలు తెలిపారు. అలాగే స్కూల్ మొదటి బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, అజయ్, సీహెచ్ సుధాకర్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో 2022–23 ఆర్థిక ఏడాది ముగుస్తున్నందున బకాయిలు ఉన్న ఇంటిపన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నులు, వ్యాపార లైసెన్స్ ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నూజివీడు: నిబంధనలు పాటించకుంటే వాహనాలను సీజ్ చేస్తామని రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే ఆటోవాలాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పట్టణంలోని అన్నవరం వద్ద ఒక ఆటోలో 20 మంది మహిళా కూలీలు ప్రయాణించడంతో ఆ వాహనాన్ని నిలిపివేసి, మహిళలకు, ఆటో డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు.

చలివేంద్రాల ఏర్పాటు



విస్సన్నపేట: వేసవిలో బాటసారులకు దాహార్తి తీర్చేందుకు స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆరు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి తెలిపారు. పట్టణంలో ప్రధాన రహదారుల కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సర్పంచ్, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఉపసర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



విస్సన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచిగా బోధించాలని డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రెడ్డిగూడెం రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నిర్వహించిన మండల సమైఖ్య సమావేశంలో పీడీ పాల్గొన్నారు.

అన్నదానం

చాట్రాయి: చనుబండ కోదండరామ కోనేరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయ భజన మండలి సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అనంతరం 1,200 మందికి అన్నదానం చేశారు. కోదండ రామాలయ వంశపారంపర్య ధర్మ కర్త పుచ్చకాయల చెన్నకేశవ రెడ్డి, నిర్వాహకులు వంకిణి వెంకటేశ్వరావు, కొక్కెరపాటి లక్ష్మణరావు, నాగాచారి, వనమా వాసు, జల్లేపల్లి మురళీకృష్ణ, చౌదరి, పొగడ పూల శివకుమార్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆగిరిపల్లి: మామిడిలో తామర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఉద్యానశాఖ అధికారి ఆర్.హేమ మామిడి రైతులకు సూచించారు. మండలంలోని ఈదులగూడెంలో గల మామిడి తోటలను మంగళవారం హెచ్ఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోటలు పిందె, కాయ దశల్లో ఉన్నాయన్నారు. మామిడి చెట్లకు తామర పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2మిలీ.లీటరు నీటికి ఇమిడా క్లోప్రిడ్ 0.5మి.లీ లేదా థయామిక్సమ్ 0.3 గ్రాములకు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు

నేటి నుంచి ప్రథమ సంవత్సర పరీక్షలు



ఇంటర్ పరీక్షలకు సిద్ధమైన మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల

నూజివీడు: బుధవారం నుంచి నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలకు పట్టణంలోని పరీక్ష కేంద్రాల్లో సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శారదా జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 1,704 మంది, ద్వితీయ సంవత్సరానికి 1,373 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రశ్నపత్రాలు ఇప్పటికే పోలీస్‌స్టేషన్లలోని స్టాకు పాయింట్‌కు చేరుకున్నాయి. పరీక్ష కేంద్రాలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్‌లను, డిపార్ట్‌మెంట్ అధికారులను, ఇన్విజిలేటర్లను నియమించి వారికి శిక్షణ కార్యక్రమం పూర్తయింది. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు 8.30 గంటలకు చేరుకోవాలి. 9గంటల తరువాత పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించబోమని ప్రశ్నపత్రాల కస్టోడియన్ స్వర్ణలత తెలిపారు. ఈ దఫా అన్ని పరీక్ష కేంద్రాల్లోని ప్రతి రూమ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా ఉన్నతాధికారులు సైతం ఎప్పటికప్పుడు పరిశీలించేలా ఏర్పాట్లు చేశారు. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు సైతం తమ ఫోన్‌లను తీసుకురావడానికి అనుమతి లేదు. మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్‌గా ఐ గిరిదేవి, శ్రీ శారద కళాశాలకు ఈదర కోటేశ్వరరావు, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలకు ఎస్ వెంకటలక్ష్మి, వాగ్దేవి జూనియర్ కళాశాలకు సంధ్యాజ్యోతి నియమితులయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించారు. ఏఎన్ఎంలను నియమించడంతో పాటు తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు పూర్తి

తిరువూరు: పట్టణంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 346 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 402 మంది, నాగార్జున జూనియర్ కళాశాల్లో 252 మంది పరీక్షలు రాస్తున్నట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు మురళీకృష్ణ, కోటిరెడ్డి తెలిపారు.



మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

రూ.11.54 కోట్ల మిగులు బడ్జెట్‌కు ఆమోదం

- మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి
- చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ

నూజివీడు: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ పాలకవర్గం రూ.11.54 కోట్ల మిగుల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రారంభ నిల్వ రూ.12.17 కోట్లకు, ఆదాయం రూ.45.50 కోట్లు, మొత్తం ఆదాయం రూ.57.67 కోట్లుగా అంచనా వేశారు. దీనిలో ఖర్చులు రూ.46.13 కోట్లు, మిగులు రూ.11.54 కోట్లుగా బడ్జెట్ అంచనాలు రూపొందించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. మొత్తం బడ్జెట్‌లో రూ.4.40 కోట్లు ఆస్తి పన్ను కింద వసూలు కాగలదని అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, రిజిస్ట్రేషన్ స్టాంపు డ్యూటీ, సీఆర్‌డీఏ నుంచి వచ్చే మొత్తం అన్నింటినీ కలిపి మున్సిపాలిటీ ఆదాయంలో చూపించారు. జనరల్ ఫండ్స్ నుంచి జీతాలు చెల్లించగా మిగిలిన నిధులను అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు అంచనాలు రూపొందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ మాట్లాడుతూ ఈ బడ్జెట్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. మున్సిపల్ ఆదాయం పెంచుకునేందుకు అవకాశం ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో మంచినీటి ఇబ్బందులు కలగకుండా కార్యాచరణ ప్రణాళిక తయారు చేశామన్నారు. అవసరమైన చేతిపంపులు మరమ్మతులు చేయించి అందుబాటులో ఉంచుతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున వాటిని పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేయాలన్నారు. గత సమావేశంలోనూ ఈ విషయమై చర్చించామని, ఇంత వరకు ఎలాంటి కార్యాచరణ ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. స్టాంపు డ్యూటీ రూ.2కోట్లు, సీఆర్‌డీఏ నుంచి రావాల్సిన నిధులు రూ.కోటి ఎందుకు మున్సిపాలిటీకి చెల్లించడంలేదో వివరణ కోరుతూ సంబంధిత శాఖలకు లేఖ రాయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ మేనేజర్ కే మనోజ, టీపీఓ చిన్న వెంకయ్య, ఏఈ కృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణమందు పంపిణీ



గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో బాలికలకు ఆల్బెండజోల్ ట్యాబ్‌లెట్లు వేస్తున్న డాక్టర్ సుధా ప్రసూజా



ఆంజనేయపురంలో డీవార్మింగ్ మందు పంపిణీ

తిరువూరు: మండలంలో మంగళవారం డీవార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేశారు. చౌటపల్లి, రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కల్యాణచక్రవర్తి, నరసింహనాయక్, చలపతిరావు పర్యవేక్షణలో వైద్యారోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరు వేల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలం పరిధి గ్రామాల్లో ఆల్బెండజోల్ ట్యాబ్‌లెట్లు మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యులు సుధాప్రసూజా మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల వయస్సు వారికి ఆల్బెండజోల్ 400ఎంజీ ట్యాబ్‌లెట్లు ఇవ్వడం వలన నులిపురుగులు నివారించవచ్చన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ కె.వాణి హాజరై విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులను వేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.పుష్పలత, ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.జగన్‌మోహనరావు, టీనా, పాల్గొన్నారు. సగ్గూరు, ఈదర పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులను వేశారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలోని రాఘవాపురం గ్రామంలోని హైస్కూల్లో నులిపులి పురుగుల నివారణ మాత్రలను జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీ, కస్తూర్బాగాంధీ, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ శంకరరావు, డాక్టర్ సందేష్ పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 19 సంవత్సరాల లోపు వారికి నులిపురుగుల నివారణ మాత్రలు మంగళవారం పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కూడా మాత్రలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం 19 సంవత్సరాల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కే శ్రీనివాస్ పర్యవేక్షణలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

చాట్రాయిలో..

చాట్రాయి: చాట్రాయి జెడ్పీ హైస్కూల్లోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి లీనాబెంజిమెన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ మురళీమోహనరావు, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాస రెడ్డి, సీహెచ్ఓ రమణ పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: రక్తహీనత నివారణకు 19 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లలందరూ నులి పురుగుల నివారణ మందులను వేసుకోవాలని గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.శ్రీనివాస్‌గౌతమ్ అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు., వైద్యాధికారి పి.అనూష, హెల్త్ సూపర్‌వైజర్లు గూండ్రు శ్రీనివాసరావు, పద్మావతి, ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని దిగవల్లి పీహెచ్‌సీ పరిధిలోని స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు.

భార్యను బెదిరించిన భర్తపై కేసు నమోదు

ఆగిరిపల్లి: కట్టుకున్న భార్యను నలుగురిలో అవమానించి, బెదిరించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.చంటిబాబు మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు మండలంలోని అడవినెక్కలంకు చెందిన గాయత్రికి నున్న గ్రామానికి చెందిన కంచర్ల రమణయ్యను 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐదేళ్ల క్రితం భర్త మానసికంగా వేధిస్తుండడంతో అతనిపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడ కోర్టులో కేసు విచారణ కొనసాగుతోంది. అప్పటి నుంచి గాయత్రి తన తల్లిదండ్రుల వద్ద ఉంటూ బీరువాల కంపెనీలో పని చేసుకుంటూ జీవిస్తోంది. ఈ నెల 10న గాయత్రి భర్త రమణయ్య ఆమె పని చేసే ప్రాంతానికి వెళ్లి అందరి మధ్య అవమానకరంగా దూషించి, బెదిరించాడని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

కోడిపందేలపై దాడి

ఆగిరిపల్లి: కృష్ణవరలలో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్సై ఎస్.చంటిబాబు తన సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో కోడిపుంజు, రూ.1,950 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ముగ్గురు జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పూరిల్లు దగ్ధం



ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన శిలారపు దాసుకు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందరూ బయటకు వచ్చి తేరుకునే సరికి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్ తక్కువగా ఉండటంతో పేలినా ప్రమాదం తప్పింది. నూజివీడు ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సమాచారం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్ పర్సన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఈలప్రోలు వెంకట సుబ్బయ్య దాసు కుటుంబాన్ని పరామర్శించారు. వెంకట సుబ్బయ్య తనవంతు సాయంగా రూ.10 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే సాయాన్ని వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

'వర్గీకరణతో మాదిగలకు న్యాయం'

ఆగిరిపల్లి: ఎస్సీ వర్గీకరణతో మాదిగ జాతికి న్యాయం దక్కుతుందని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నా అన్నారు. స్థానిక షాదీఖానాలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు మాదిగల ఐక్య శంఖారావ సభను సోమవారం రాత్రి మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ఇన్‌చార్జి కంబాల ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రవిశేఖర్, దళిత బహుజన గిరిజన హక్కుల దండోరా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలపాల సురేష్‌బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు లాం డానియల్, ఎంఎస్ఎఫ్ మండల నాయకులు బొబ్బర్ల సురేష్, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, వెంకయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చాట్రాయి: గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. మంగళవారం మండలంలోని చనుబండలో బెతెస్తా పెంతికోస్తు ప్రార్థనా మందిరంలో చింతలపూడి స్ఫూర్తి ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయనతోపాటు సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఎంపీటీసీ దార్ల సోనీ ఆనంద్, పాస్టర్ వై పురుషోత్తమ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం పనుల పరిశీలన



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ వెంకటేశ్వరరావు

ఎ.కొండూరు: డయాలసిస్ కేంద్రం నిర్మాణ పనులు త్వరిగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఈఈ వెంకటేశ్వరరావు ఆదేశించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ. 9లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డయాలసిస్ కేంద్రాన్ని మంగళవారం ఈఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ చేయించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే కే. రక్షణనిధి సహకారంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ డయాలసిస్ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయుర్వేద భవనానికి మరమ్మతులు చేసేందుకు రూ. 4లక్షలు, డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు రూ. 5లక్షలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పనులు పూర్తి చేసి త్వరలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రంలో నలుగురు డయాలసిస్ రోగులకు వైద్యం చేసేందుకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సీహెచ్ సాంబశివరావు పాల్గొన్నారు.

స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు కొండలరావు మృతి



బొబ్బిలి కొండలరావు (ఫైల్)

నూజివీడు: పట్టణ ప్రముఖులు, నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు బొబ్బిలి కొండలరావు(88) మంగళవారం స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రస్తుత ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు కొండలరావు అత్యంత సన్నిహితులు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఎంఆర్ అప్పారావుకు ముఖ్య అనుచరులు. స్పోర్టింగ్ క్లబ్ వ్యవస్థాపకుల్లో ఒకరిగానే కాకుండా అదే క్లబ్‌కు కార్యదర్శిగా వ్యవహరించారు. 50 ఏళ్లుగా అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ దసరా ఉత్సవాలను, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా, డీఏఆర్ కళాశాల పాలకవర్గం కార్యదర్శిగా, కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, కార్యదర్శిగా 20 ఏళ్ల పాటు పనిచేశారు. పట్టణంలో రోటరీ క్లబ్ కల్యాణ మండపానికి స్థలాన్ని విరాళంగా అందజేశారు. బాల్యం నుంచి కబడ్డీ, టెన్నీస్, చెడుగుడు, బాస్కెట్‌బాల్‌లో ప్రావీణ్యం సాధించారు. బొబ్బిలి కొండలరావు మృతికి స్పోర్టింగ్ క్లబ్ తీవ్ర సంతాపాన్ని తెలిపింది. సంతాపం తెలిపిన వారిలో ఫెస్టివల్ కార్యదర్శి రామిశెట్టి మురళీకృష్ణ, కార్యదర్శి టీవీ కృష్ణారావు, దాసరి సూర్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కోటగిరి సతీష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్ ఉన్నారు. కొండలరావు అంత్యక్రియలను రోటరీ ఆడిటోరియం సమీపంలోని సొంత మామిడి తోటలో బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మియాపూర్‌కు నూతన బస్సు సర్వీసు



నూతన బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న తాతినేని పద్మవతి.

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ప్రజా రవాణా సంస్థ విజయవాడ నుంచి మియాపూర్‌కు స్టార్ లైనర్ (నాన్ ఏసీ స్లీపర్ కోచ్) నూతన బస్సు సర్వీసును ప్రారంభించింది. సర్వీస్ నంబర్ 3535 తో నడుపుతున్న ఈ బస్సును మంగళవారం సాయంత్రం విజయవాడ మెయిన్ డిపో నుంచి జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి లాంఛనంగా ప్రారంభించారు. ఈ బస్సు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి రోజూ రాత్రి 11.15 గంటలకు బయలు దేరి కోదాడ, సూర్యాపేట మీదుగా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు మియాపూరు చేరుతుంది. తిరిగి ఈ బస్సు సర్వీస్ నంబర్ 3502 తో మియాపూర్‌లో రాత్రి 10 గంటలకు బయలు దేరి ఉదయం 5.30 కు విజయవాడ చేరుకుంటుంది. 30 బెర్తులతో నడిచే ఈ బస్సులో చార్జీలు పై బెర్తుకు రూ. 670, కింది బెర్తుకు రూ. 730 గా నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణా శాఖా అధికారి. ఏసుదానం తెలిపారు. కార్యక్రమంలో జోన్–2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ సీటీఎం జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురానికి చెందిన వక్కలగడ్డ భవాని గొల్లపూడిలోని బాలాజీ ఫార్మాటెక్‌లో పని చేస్తోంది. ఆమె భర్త అఖిల్ కృష్ణవేణి మార్కెట్‌లో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్నాడు. వీరిద్దరిది ప్రేమ వివాహం. కొన్నిరోజులుగా భవాని పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో ఈనెల 11వ తేదీ భర్త షాపునకు వెళ్లిన సమయంలో తాను కుట్టు మిషన్ వద్దకు వెళ్లి వస్తానని అత్తమామలతో చెప్పి బ్యాగు సర్దుకుని వెళ్లింది. ఆమె ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అత్తమామలు తమ కుమారుడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బంధువులు స్నేహితుల ఇళ్ల వెదికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో భవాని భర్త అఖిల్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భవానీ పనిచేసే షాపు పక్క దుకాణంలోని వ్యక్తికూడా కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి

ఆగిరిపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై చంటిబాబు అన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ద్విచక్ర వాహనదారులకు మంగళవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్‌ను వినియోగించి ప్రాణాలను రక్షించుకోవాలని పేర్కొన్నారు.

తూముల ఏర్పాటు

తోలుకోడు(మైలవరం): మైలవరం మండలం తోలుకోడులో మంగళవారం డ్రెయినేజీల అభివృద్ధిలో భాగంగా మురుగునీటి తొలగింపునకు డ్రెయినేజీల్లో తూములు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఓబులురెడ్డి దుర్గారెడ్డి తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్త చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బుర్రి ప్రతాప్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ



వీణపై కీర్తనలు పలికిస్తున్న సంగీత సమితి బాలికలు

విజయవాడ కల్చరల్: సంగీతమూర్తిత్రయంలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ 257వ జయంతి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. దీక్షితార్ రచించిన సంకీర్తనలను సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, ఎస్ఎస్ కల్యాణరామన్, బీవీ దుర్గాభవాని, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, సద్గురు చరణ్, గండూరి శ్రీనివాస మూర్తి, చిట్టాకార్తీక్, మల్లాది కార్తీక త్రివేణి, లంకా తేజస్విని, సుబ్రహ్మణ్య సంగీత సమితి విద్యార్థులు ఆలపించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో ముత్తుస్వామి దీక్షితార్, త్యాగరాజ స్వామి, శ్యామశాస్త్రి సంగీత త్రిమూర్తులుగా భావిస్తారన్నారు. సంకీర్తనల ద్వారా భగవంతుని చేరుకోవచ్చునని భావించినట్లు తెలిపారు.

గణితంపై అవగాహన పెంచుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ కె.గంగాధరరావు

గుణదల (విజయవాడ తూర్పు): గణిత శాస్త్రంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధర్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో మూడు రోజులు జరిగే అంతర్జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. గణితంలో వస్తున్న మార్పులు గమనిస్తూ ముందుకుసాగాలన్నారు. ఆధునిక ప్రపంచంలో గణిత శాస్త్రంపై ఆదరణ పెరుగుతోందన్నారు. విద్యార్థి దశలోనే గణితాన్ని ఆకళింపచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనోవా విశ్వవిద్యాలయం సీనియర్ డైరెక్టర్ డి. రత్నాకర్, లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, గణితశాస్త్ర విభాగాధిపతి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలని, అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తే లక్ష్యాలు సులభంగా చేరుకోవచ్చని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ గణిత దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణితంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని, అన్ని శాస్త్రాల్లో గణితం ఇమిడి ఉంటుందన్నారు. కళాశాల గణిత శాస్త్ర విభాగాధిపతి కేవీ నాగలక్ష్మి గణిత శాస్త్ర విశిష్టత వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, సెమినార్ నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల గణిత విభాగం అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.